క్లుప్తంగా

పోలీసుల అదుపులో కోడిపందేల జూదరులు

చీమకుర్తి: కోడిపందేలు వేస్తున్న 9 మంది జూదరులను సంతనూతలపాడు ఎస్సై శ్రీకాంత్ అదుపులోకి తీసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం సంతనూతలపాడు పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు వేస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న 9 మంది నుంచి మూడు కోడి పుంజులు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

హైవేపై తప్పిన పెను ప్రమాదం


రోడ్డు మీద పడిన జిగురు పదార్థం

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరం దక్షిణ బైపాస్ రోడ్డు మీద పెను ప్రమాదం తప్పింది. ఆదివారం అర్ధరాత్రి దక్షిణ బైపాస్ రోడ్డులోని సంఘమిత్ర సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం నుంచి లీకైన ముడిపదార్థం జిగురుగా ఉండటంతో పలువురు వాహన చోదకులు జారి పడ్డారు. లారీలు, బస్సులు లాంటి భారీ వాహనాలు సైతం రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా ఎస్ఐ బి.అజిత అక్కడికి చేరుకొని పరిస్థితిని గమనించి ఫైర్ సిబ్బంది సహకారంతో రోడ్డు మీది జిగురు పదార్థాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

శోభాయమానంగా తిరువీధి ఉత్సవం


శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

ఒంగోలు టౌన్: ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం నిర్వహించిన శ్రీవారి తిరువీధి ఉత్సవం శోభాయమానంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామి భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించి తరించారు. ఈ సందర్భంగా అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం కళాకారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను అలరించింది. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్యనిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, కోలాట బృంద కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీత విభావరి బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు: అక్కినేని వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 22న అక్కినేని కళాపరిషత్ ఏర్పాటు చేస్తున్న సంగీత విభావరి కార్యక్రమ బ్రోచర్‌ను స్థానిక తన కార్యాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ అక్కినేని 9వ వర్ధంతి సందర్భంగా సంగీత విభావరిని స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తామన్నారు. నల్లగొండకు చెందిన గాయకుడు శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని పాడతారని, అక్కినేని, ఘంటసాల అభిమానులు మిక్కిలిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, అక్కినేని కళాపరిషత్ సభ్యుడు ఎన్నూరి నాగేశ్వర రావు, అంకబాబు పాల్గొన్నారు.

ప్రజల ఐక్యత కోసమే ఆటలు


బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజల మధ్య ఐక్యత, సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించినట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న అన్నారు. భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం సహకారంతో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీనగర్, సుందరయ్య నగర్ లలో వివిధ ఆటల పోటీలు నిర్వహించి సోమవారం నిర్వహించిన సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. యువజన సంఘం నగర మాజీ అధ్యక్షుడు ఎస్కే పీర్ సభకు అధ్యక్షత వహించారు. చీకటి శ్రీనివాసరావు, జీవీ కొండారెడ్డి, ఎస్డీ హుసేన్, దాసు, జబ్బర్, బి.గోవిందమ్మ పాల్గొన్నారు.


ఉప్పుగుండూరు ఊర చెరువులో వేణుగోపాల స్వామి తెప్పోత్సవం


కొప్పోలు చెరువులో చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

ఇంటింటా సంక్రాంతి

- ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు
- గ్రామాల్లో ఆటపాటలతో సందడి

ఒంగోలు రూరల్:

సంక్రాంతి సంబరాలు నియోజకవర్గంలో మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ఆటపాటలతో యువత సందడి చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, తెప్పోత్సవాలు నిర్వహించారు. ఒంగోలు మండలం కొప్పోలు చెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి తెప్పోత్సవం కొప్పోలు చెరువులో సంక్రాంతి రోజున ఆదివారం సాయంత్రం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు పరాంకుశం సమీర్ కుమార్, ఆలయ నిర్వాహకులు తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. మండలంలోని గుండాయపాలెం, దేవరంపాడు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఇందులో భాగంగా మహిళలకు, పురుషులకు, బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఒంగోలు ఎంపీపీ పల్లప్రోలు మల్లికార్జునరెడ్డి, రూరల్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ రాయపాటి అంకయ్య, గుండాయపాలెం గ్రామంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సౌజన్య ఎంపీటీసీ అయ్యలవాణి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు పేతురు, గ్రామ నాయకులు బాబులు, కార్యదర్శి ఆశీర్వాదం పాల్గొన్నారు.


కె.పల్లెపాలెం సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వంశీ కృష్ణ, మధుసూదన్‌రావు

కె.పల్లెపాలెంలో..

కొత్తపట్నం: మత్స్యకార గ్రామమైన కె.పల్లెపాలెంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీరామ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్ వారి ఆధ్వర్యంలో సోమవారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, డాక్టర్ మహిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీలో బాలసంస్కార కేంద్రాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. కె.పల్లెపాలెం గ్రామ పెద్దలైన ముగ్గురు కాపులు, సమ్మిడుల భార్య, భర్తలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు హాజరై విజేతలకు 150 మందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి, శ్రీవాణీ విద్యానికేతన్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, గ్రామ కాపులు సైకం పోతురాజు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నపు తిరుపతి, రేవు చలపతివర్మ, శ్రీరామ్ హాస్పిటల్ మేనేజర్ సుధాకర్, బాషా, మాల్యాద్రి, శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల ఉపాధ్యాయులు సైకం అంజలి, సంధ్యశ్రీ, నేలటూరు అనిత, సూపర్‌వైజర్ అక్కుంగారి లక్ష్మణ్, అవనిగడ్డ బాలకృష్ణ, కోచ్ రామకృష్ణ, కొక్కిగడ్డ నాంచార్లు పాల్గొన్నారు.

వేణుగోపాలునికి తెప్పోత్సవం

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండుగను గ్రామాల్లో బంధుమిత్రుల మధ్య ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని ఉదయం నుంచే ఆలయాలన్నీ భక్తులతో సంక్రాంతి కిటకిటలాడాయి. ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీఆళ్వారాజుల వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ పూజారి దివి శ్రీధర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఊరచెరువులో ఏర్పాటు చేసిన తెప్పోత్సవాన్ని వీక్షించి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో తిరునాళ్ల వాతావరణం ఉట్టిపడింది. అనంతరం సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ ఆధ్వర్యంలో ఒంగోలు చిన్నారులచే ఏర్పాటు చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది.



పారువేటలో దేవతా ఉత్సవమూర్తులు


పారువేట వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని, పక్కన ఎంపీ మాగుంట

చిన్నతనం నుంచే పారువేటతో అనుబంధం

- పారువేటలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక గద్దలగుంట పారువేట కార్యక్రమం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. రంగారాయుడు చెరువులో తెప్పోత్సవం అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు గద్దలగుంట పారువేటకు వచ్చారు. గద్దలగుంట ముఖద్వారంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు నేతృత్వంలో ఏర్పాటైన పాటకచ్చేరికి బాలినేని, ఎంపీ పాల్గొన్నారు. అనంతరం స్థానిక గద్దలగుంటలోని నాగార్పమ్మతల్లి, అంకమ్మ తల్లి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడ నుంచి శ్రీమహాలక్ష్మి అమ్మవారు, శ్రీకోదండ రామస్వామి ఆలయం, అంకమ్మ తల్లి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోదండ రామస్వామి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన పాటకచ్చేరి కార్యక్రమానికి బాలినేని, మాగుంట ఇరువురు హాజరయ్యారు. చిరంజీవి అభిమానుల కోరిక మేరకు సంయుక్తంగా వాల్తేరు వీరయ్య సినిమా కేక్‌ను కట్ చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వేళ మాత్రమే రాజకీయాలు అని, మిగతా సమయం మొత్తం అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యం అన్నారు. అందరం ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి వేగం అవుతుందన్నారు. చిరంజీవి ఇంకా ఎన్నో మంచి సినిమాలు తీయాలని, ఆయన సినిమాలు సక్సెస్ కావాలని కోరుకుంటున్నామన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ చిరంజీవితో తమ కుటుంబానికి మంచి బంధం ఉందని అన్నారు. చిరంజీవి వాల్తేరు వీరయ్య అయితే ప్రస్తుతం బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు వీరయ్యగా చిరంజీవి అభిమానులు పేర్కొంటుండడం మరింత ఆనందంగా ఉందన్నారు. అనంతరం అక్కడ నుంచి గాంధీబొమ్మ సెంటర్‌లో 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత ఏర్పాటు చేసిన పాటకచ్చేరిలో ఇరువురు పాల్గొన్నారు. ఇక్కడ బాలినేని, మాగుంటను వైఎస్సార్ సీపీ నాయకులు ఒగిరాల వెంకట్రావు, తోటపల్లి సోమశేఖర్, కార్పొరేటర్ తాడి కృష్ణలత సత్కరించారు. రాజరాజేశ్వరస్వామి అమ్మవారు, గద్దలగుంట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఇరువురు గద్దలగుంట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని పాట కచ్చేరిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.


గద్దలగుంట పారువేటలో ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు


పారువేట వేడుకలో డాన్స్ చేస్తున్న డాన్సర్లు


సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహంగా తిలకిస్తున్న ప్రజలు

మీ వాడిని..

ఎప్పుడూ అందుబాటులో ఉంటా


బాలినేనిని గజమాలతో సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: "నేను మీ వాడిని...మీతో కలిసి పెరిగిన వాడ్ని..తిరిగిన వాడ్ని...నా బాల్యం అంతా గద్దలగుంటలోనే గడిచింది. ఇక్కడి ప్రజల ఆప్యాయతను ఎప్పటికీ మరిచిపోలేను" అని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... గద్దలగుంటతో తన అనుబంధం విడదీయరానిదన్నారు. ఇక్కడి సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న గద్దలగుంట అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. ఇప్పటికే గద్దలగుంటలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, మరో వారం రోజుల్లో రూ.10 లక్షలతో మహిళా భవన్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో గద్దలగుంటలో చేపట్టి పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు శ్రీనివాసరెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డిని కమిటీ సభ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బాలినేని

బహుమతి ప్రధానోత్సవ సభకు కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు సభా నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, కాపు కళ్యాణ మండపం చైర్మన్ టీవీ రంగారావు, విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సాంబశివరావు, కమిటీ సభ్యులు ఈదుపల్లి అంకబాబు, కాటా నాగేశ్వరరావు, ఈదుపల్లి కోటేశ్వరరావు, చిట్టెం వెంకటేశ్వర్లు, తోటకూర చైతన్య, మలిశెట్టి రాజేంద్రప్రసాద్, దండే వెంకటేశ్వర్లు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

చీమకుర్తి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గాంధీనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న 56 మంది మహిళలకు మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. మారం వెంకటేశ్వరరెడ్డి, కోటా రాములు, బడే దశరథరామిరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పద్మశాలీయుల ఆలయ ప్రాంగణంలో మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సంఘం నాయకుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. చింతకింది అశోక్, మార్కండేయ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.


బహుమతులను అందిస్తున్న మారం వెంకారెడ్డి

దివ్యాంగ విద్యార్థులకు అన్న సంతర్పణ

ఒంగోలు సబర్బన్: దివ్యాంగ విద్యార్థులకు సుహరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులోని శ్రీ సూర్య దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగులు హాస్టల్‌లోని 40 మంది విద్యార్థులకు కనుమ పండుగను పురస్కరించుకొని నాన్ వెజిటేరియన్ భోజనం వడ్డించారు. డ్వామా పీడీ కే.శీనారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్న సంతరర్పణతో పాటు దివ్యాంగ విద్యార్థుల హాస్టల్‌కు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు కూడా అందజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శీనారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, సుహరి ఫౌండేషన్ అధినేత సాధనాల సురేష్ బాబు, బండారుపల్లి రవితేజ, బొడ్డు సురేష్ బాబు, దాసరి శ్రీనివాస్, కళ్యాణి, ఖాదర్ బాష, కొల్లా ప్రవీణ్, మాల్యాద్రి, షిరిడీ శ్రీనివాస్‌లు పాలొన్నారు.


దివ్యాంగ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డ్వామా పీడీ కే.శీనారెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ కళాశాలలో 1996–97 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి విద్యార్థులంతా జూనియర్ కళాశాల వేదికగా పాత స్నేహితులను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. వివిధ వృత్తుల్లో స్థిరపడినవారు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సామగ్రిని సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానించిన పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ వీరప్పయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు రాఘవరావు, బాలాజీ, కోటిరెడ్డి, విజయలక్ష్మీ, మాధవిలత, జోసెఫ్, శ్రీనివాస్, ఆంజినేయులు, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్తేరు వీరయ్య విజయోత్సవ కేక్ కట్ చేసిన బాలినేని


బాలినేనిచే కేక్ కట్ చేయిస్తున్న చిరంజీవి ఫ్యాన్స్

ఒంగోలు: మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమాను స్థానిక కృష్ణా థియేటర్‌లో సంక్రాంతి పండుగ రోజు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ అభిమానులు ఏర్పాటు చేసిన సినిమా విజయోత్సవ కేక్‌ను బాలినేని కట్ చేశారు. ఆయన వెంట ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయినా బత్తిన ఘనశ్యాం, చిరంజీవి అభిమానుల సంఘం నాయకుడు రావూరి బుజ్జి ఉన్నారు.

చంద్రబాబు ప్రచార పిచ్చితో ప్రాణాలు తీస్తున్నాడు

- 2024 ఎన్నికల్లో జగనే సీఎం.. ఇది పక్కా
- టీడీపీ నాయకులు తొందరపడి డబ్బులు ఖర్చుపెట్టి జీవితాలు నాశనం చేసుకోవద్దు
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి

ఒంగోలు: ప్రచార పిచ్చితో చంద్రబాబు ప్రజల ప్రాణాలు తీస్తున్నాడని, ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణాల రక్షణకు ప్రభుత్వం జీవో నంబర్ 1 తీసుకొస్తే దానిని టీడీపీ, జనసేన, సీపీఐలు విమర్శించడం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇరుకు సందుల్లో సమావేశాలు నిర్వహించి కందుకూరులో 8 మంది ప్రాణాలు, చీరెలు ఇస్తామంటూ అమాయక పేద ప్రజలను ఆశపెట్టిన కారణంగా ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇటువంటి మరణాలు పునరావృతం కారాదని, పేదల హృదయ వేదన అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో నంబర్ ఒకటి తీసుకొచ్చారన్నారు. అది అర్థం చేసుకోకుండా పేదల ప్రాణాలు పోయినా ఫర్వాలేదు... తమ మీటింగ్‌లు మాత్రం యథాతథంగా జరగాలంటే ఎలా అంటూ ప్రశ్నించారు. ఇటువంటి చర్యలను ప్రజలు హర్షించరన్నారు. కేవలం చంద్రబాబు ప్రచార పిచ్చి కారణంగానే 11 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. సీపీఐ, జనసేన, టీడీపీ మూడు కలిసి పనిచేసినా 2024 ఎన్నికల్లో జగన్‌ను సీఎం కాకుండా ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. తనకు శ్రీవెంకటేశ్వర పొలిటికల్ సర్వే సంస్థ ఉందని, ఎన్ని విధాలుగా సర్వేచేసినా ప్రజలు మాత్రం జగన్ వైపు ఉన్నారని, కేవలం ప్రచార ఆర్భాటం ద్వారా టీడీపీ మైలేజీ పెంచుకోవాలని చూస్తోందన్నారు. ప్రకాశం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందని, ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని పాతిక వేల ఓట్లకు పైగా మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కనీసం ప్రతిపక్ష పార్టీ నేత అందుబాటులో లేకపోవడం, ఒక వేళ వస్తే పేదలను ఆదుకోవడానికి డబ్బు వెచ్చించాల్సి వస్తుందంటూ హైదరాబాదు, బెంగళూరులో దాక్కున్నారనే భావన సర్వత్రా వ్యక్తమవుతోందన్నారు. చంద్రబాబు ఏదోలా జనాలను నమ్మించి టికెట్లు అంటగట్టాలని ఆరాట పడుతున్నారని, టీడీపీ నాయకులు పోటీ చేసి ఉన్నదంతా పోగొట్టుకుని తరువాత బాధపడే కంటే ముందుగానే ఆలోచించుకోవడం మంచిదని సూచించారు. ఇటీవల చంద్రబాబు పెట్టిన రెండు రకాల బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ కార్యక్రమాలు కూడా ప్రజల్లో ఆయనకు వ్యతిరేకత పెంచేవిగానే ఉన్నాయన్నారు. మిణుగురు పురుగుల్లా చంద్రబాబు వద్దకు చేరవద్దని, దగ్గరకు వెళితే కాలిపోయేది మీరే అని గుర్తుంచుకోవాలని అన్నారు. మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ మీరావలి మాట్లాడుతూ బాలినేనిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం దామచర్ల జనార్దన్ మానుకోవాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న రొండా అంజిరెడ్డి

టెన్నిస్ బాల్ క్రికెట్ విజేత ఒంగోలు

చీమకుర్తి: సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజుల పాటు సంతనూతలపాడులో ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన టీమ్ విజేతగా నిలిచింది. సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మొత్తం 30 జట్లు వచ్చాయి. ప్రథమ స్థానంలో నిలిచిన ఒంగోలు హౌసింగ్ బోర్డు జట్టుకు రూ.6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సంతనూతలపాడు జట్టుకు రూ.4 వేల బహుమతిని సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుంపా ఇంద్రసేనారెడ్డి అందించారు.

నేడు చీమకుర్తిలో కరెంటు సరఫరా నిలిపివేత

చీమకుర్తి: చీమకుర్తిలో మంగళవారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గాంధీనగర్‌లో కరెంటు స్తంభం ఏర్పాటు చేస్తున్నందున్న గాంధీనగర్, సూర్యనగర్, నెహ్రూనగర్, క్రిష్టియన్‌పాలెం, అంబేద్కర్ నగర్, బస్టాండ్ పరిసరాల్లో కరెంట్‌ను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపేస్తున్నట్లు తెలిపారు.